అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవ తెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 12 జూన్ 2023

బాసర ఆలయంలో కొనసాగుతున్న రద్దీ

నవతెలంగాణ-బాసర

సరస్వతి సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుండి భక్తులు నదిలో స్నానాలు చేసి దేవిని దర్శించుకోవడానికి బారులు తీరారు. భక్తుల తమ చిన్నారులకు ఆలయ సన్నిధిలోని అక్షరాభ్యాస మండపాలలో అక్షరాభస పూజలను జరిపించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



రెండు రోజులు జొన్న కొనుగోళ్లు నిలిపివేత

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్న కొనుగోళ్లు రెండు రోజులు నిలిపివేస్తున్నట్లు సీఈఓ ఆడే గణేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోదాములు పూర్తిగా నిండి ఉండడం వల్ల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 4వందల క్వింటాళ్లకు పైన జొన్నలు కొనుగోలు చేసినట్లు వివరించారు. రైతులు సంయమనం పాటించి మార్కెట్ యార్డ్‌కు జొన్నలు తీసుకొచ్చి ఇబ్బంది పడకూడదని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం 14న బుధవారం నుండి జొన్నలు కొనుగోలు చేస్తామని తెలిపారు.

బడి గంటకు వేళాయె..!

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- బడిబాటతో పెరిగిన ప్రవేశాలు
- వెక్కిరిస్తున్న ఉపాధ్యాయ ఖాళీలు
- నోటు పుస్తకాల అందజేతపై స్పష్టత కరువు

రెండు నెలల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. సెలవుల్లో ఆటపాటలతో నిమగ్నమైన విద్యార్థులు ఇక నుంచి పుస్తకాలతో కుస్తీ పట్టనున్నారు. ఉపాధ్యాయులు ఇప్పటికే బడిబాట పేరుతో గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ కొత్త విద్యార్థులను బడిలో చేర్పిస్తున్నారు. ఓ వైపు విద్యార్థులకు బడులు ప్రారంభమవుతున్నాయనే సంతోషం వ్యక్తం కాగా..మరోవైపు సరిపడా బోధకులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు లేరనే అసంతృప్తి నెలకొంది. సర్కారు బడుల్లో ఎప్పటిలాగే సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. సర్దుబాటు ప్రక్రియలోనూ ఎలాంటి ముందస్తు చర్యలు లేకపోవడంతో విద్యార్థులకు మరికొన్ని రోజుల పాటు పూర్తిస్థాయి పాఠాలు కొనసాగడం కష్టంగా మారుతోంది. ఉపాధ్యాయ ఖాళీలతో ఇప్పటికీ జిల్లాలో సింగిల్ టీచర్ పాఠశాలలు కొనసాగడం విమర్శలకు తావిస్తోంది. అనేక బడుల్లో మౌళిక సదుపాయాలు లేకపోవడం విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతోంది.



కప్పర్లలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

విద్యార్థులను భవిష్యత్తు పౌరులుగా తీర్చిదిద్దుతున్న సర్కారు బడుల్లో సదుపాయాల సమస్య వెంటాడుతోంది. ప్రభుత్వం మన ఊరు-మనబడి కార్యక్రమం కింద ప్రత్యేకంగా నిధులు కేటాయించి 12అంశాల్లో సదుపాయాలు కల్పిస్తోంది. ఈ పథకం కింద తొలి విడతలో చేపట్టిన 137 పాఠశాలల్లో ఇప్పటి వరకు కేవలం 130పాఠశాలల్లోనే పనులు పూర్తయ్యాయి. ఇంకా 100 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. వీటిని పూర్తిచేయగానే రెండో విడతలో మరిన్ని పాఠశాలలను ఎంపిక చేసేందుకు వీలుంటుంది. కానీ నిర్మాణాల్లో జాప్యం జరగడం మూలంగా ఆటంకం ఏర్పడుతోంది. మరోపక్క మిగిలిన పాఠశాలల్లోనూ తరగతి గదులు, ఫర్నీచర్ తదితర సమస్యలు ఉన్నాయి. మరికొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం, తరగతి గదులు అస్తవ్యస్తంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్కారు బడుల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్నా అందుకనుగుణమైన సౌకర్యాలు మాత్రం ఉండటం లేదు. విద్యాశాఖ, ఉపాధ్యాయుల కృషి ఫలితంగా ఏటా ప్రవేశాలు పెరుగుతున్నా ప్రభుత్వం సౌకర్యాలను మెరుగుపర్చడం లేదనే విమర్శలున్నాయి.

సర్దుబాటుపై కనిపించని పురోగతి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 2700కు పైగా సర్కారు బడులు ఉండగా సుమారు 3.50లక్షలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న బడుల్లో ఇతర చోట నుంచి సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. కిందటేడాది ఈ ప్రక్రియను సెప్టెంబర్ వరకు చేపట్టడంతో అప్పటికే విద్యార్థులు పాఠాలు కోల్పోవాల్సి వచ్చింది. విద్యాశాఖ ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందనే విమర్శలున్నాయి. సింగిల్ టీచర్లు ఉన్న బడుల్లో సమస్యలు ఎప్పటిలాగానే ఉంటున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి చొరవ తీసుకోవడం లేదు. మరోపక్క ఈ ఏడాది విద్యార్థులకు సమరూప దుస్తుల్లో డిజైన్ మార్చారు. కానీ కుట్టుకూలీ మాత్రం ఒక్కో జతకు కేవలం రూ.50మాత్రమే అందజేస్తోంది. అరకొర కుట్టుకూలీతో దుస్తులను కుట్టించడంలో ఎస్ఎంసీలు, తల్లిదండ్రులకు ఇబ్బందికరంగా మారుతోంది. డిజైన్ మార్చిన ప్రభుత్వం ధర పెంచడంలో మాత్రం దృష్టిసారించలేదనే విమర్శలు వస్తున్నాయి. పాఠ్యపుస్తకాలు ఇప్పుడిప్పుడే మండల కేంద్రాలకు చేరుతున్నాయి. వీటిని త్వరగా పాఠశాలలకు పంపించి విద్యార్థులకు అందజేయాల్సిన ఆవశ్యకత ఉంటుంది. ఈ ఏడాది కొత్తగా విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి హామీనిచ్చారు. కానీ ఇప్పటి వరకు ఇందులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. నోటు పుస్తకాలు అందజేయడంపై అధికారుల్లోనూ స్పష్టత లేకుండా పోయింది. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది సైతం తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పడం లేదు.

ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఆదేశాలిచ్చాం : టి.ప్రణీత, జిల్లా విద్యాశాఖాధికారి, ఆదిలాబాద్



ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో సర్దుబాటు చేసేలా ఇది వరకే ఎంఈఓలకు ఆదేశాలు జారీచేశాం. పాఠ్య పుస్తకాలు ఇప్పటికే మండలాలకు పంపించాం. ఈ నెల 20వ తేదీ వరకు పిల్లలకు సమరూప దుస్తులు అందజేస్తాం. బడిబాటతో కొత్త ప్రవేశాలు పెరిగాయి. సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తాం.



కిటికీ తలుపులు లేని దృశ్యం

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రాథమిక పరీక్ష

- 1750 మంది అభ్యర్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. 8:30గంటలకే అందరూ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. అటు టిఎస్ రెసిడెన్షియల్ బాలుర కళాశాలలోని గ్రూప్ -1 పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. అలాగే పట్టణంలోని ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 6190 అభ్యర్థులకు 4440 అభ్యర్థులు హాజరై 1750 అభ్యర్థులు గైర్హాజరైనట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్





అమల్లో ఉండటం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష పూర్తయినట్టు తెలిపారు. పరీక్ష విజయవంతంగా పూర్తి కావడంలో బందోబస్తులో పాల్గొన్న ప్రతి ఒక్క పోలీసు అధికారికి అభినందనలు తెలియజేశారు.

నిమిషం నిబంధన పకడ్బందీగాగా అమలు

జిల్లా కేంద్రంలో గ్రూప్-1 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సరైన సమయంలో రాకపోవడంతో వారిని లోపలికి అనుమతించలేదు. సిబ్బందిని వేడుకున్నప్పటికీ నిబంధనల అమలులో ఉండడంతో వారు అనుమతించలేదు. చేసేదేమీలేక తిరిగి ఇంటి దారి పట్టారు.

భవన నిర్మాణ కార్మికులకు పెద్ద పీట : విఠల్‌రెడ్డి

నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ ప్రభుత్వం భవన నిర్మాణం కార్మికులకు పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ముధోల్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కార్మిక సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా గుర్తింపు కార్డు కలిగి ఉండాలన్నారు. దీంతో ఆపద సమయంలో కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. వెంటనే కార్మికులు కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ముధోల్‌లో సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయించడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఇటీవలే మృతి చెందిన



కార్మికులకు భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో రూ.10వేల చొప్పున రూ.50వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను, నాయకులను కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల అయిలన్న, బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, పిఎసిఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఖాసీం, నాయకులు రమేష్, పోతన్న యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, బాబన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



నవతెలంగాణ-బాసర

సరస్వతి దర్శనానికి వస్తుండగా ఆదివారం ప్రమాదవశాత్తు రెండు కార్లు ఢీకొనగా ఆదిలాబాద్‌కు చెందిన డ్రైవర్ కాలు విరిగింది. మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై మహేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ నుండి ఎర్టీగా వాహనంలో సరస్వతి దర్శనానికి వస్తుండగా సాజన్ హోటల్ సమీపాన బాసర నుండి భైంసా వైపు వెళ్తున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. అదిలాబాద్‌కు చెందిన డ్రైవర్ రవి ఎడమ కాలు విరిగి తీవ్ర రక్తస్రావమైంది. కారులో ఉన్న రాధ, మల్లేష్, అన్వేష్, సాయి చైతన్యలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి స్థానికంగా చికిత్స నిర్వహించి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సురేష్, సౌరబ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి సైతం స్థానికంగా చికిత్స అందించి నాందేడ్‌కు తరలించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1987-88 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. తమకు విద్యా బుద్ధులు చెప్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అందరూ ఒకరినొకరు పలకరించుకున్నారు. వివిధ వృత్తులు, రాజకీయ, వ్యాపార రంగంలో స్థిర పడిన పూర్వవిద్యార్థులు తమ గత స్మృతులను నెమరువేసుకుంటు తాము చదువుకున్న పాఠశాలలో తిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు. తమ విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాల గురించి ఒకరికొకరు చెప్పుకుంటూ,సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటు ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, వర్తమన్నూర్ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ కళ్యం దయాకర్‌రెడ్డి, మల్లేష్‌రెడ్డి, డాక్టర్ సయోద్దీన్, కొత్తూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

పేద బాలికకు అంతిమ సంస్కారాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్అర్బన్

నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్ గ్రామానికి చెందిన పోసాని, ప్రశాంత్ కుమార్తె సారక్క(9) ఇటీవల అగ్ని ప్రమాదంలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందింది. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తీసుకెళ్లినా ఆర్థిక లేమి కారణంగా సరైన వైద్యం అందక మతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో కూతురికి అంతిమ సంస్కారాలను సైతం చేయలేని దుస్థితి. యాచకులుగా జీవనం గడుపుతున్నారు. చేసేదేమీలేక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో వారు మానవ సేవే మాధవ సేవ సంఘ బాధ్యులకు సమాచారం అందించారు. ఆ సంఘ ప్రతినిధులు స్వచ్ఛందంగా బాలిక అంతిమ సంస్కారాలను ఆదివారం హిందూ సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. కార్యక్రమంలో మానవ సేవ మాధవ సేవ బాధ్యులు శ్రీపతివార్ శ్రీనివాస్, శశికళ చౌహన్, దేవిదాస్, ఇతర సంఘాల బాధ్యులు బాలశంకర్ కృష్ణ, పసుపుల రాజు, దొంతుల ప్రవీణ్, బ్రహ్మ , గణేష్, ప్రమోద్, అఖిల్‌రెడ్డి, అజీజ్, అర్షత్ ఖాన్, రాహుల్, నారాయణ సిండే, పోలీస్ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల, కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిడాం సాయికుమార్, కొమ్రం అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ, కళాశాలలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

ఇంటర్ అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12 నుంచి 20 వరకు జరగనున్నాయి. ఉదయం 9గంటల నుండి 12 గంటల వరకు జరిగే ప్రథమ సంవత్సర పరీక్షకు 3, 792 మంది, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగే ద్వితీయ సంవత్సర పరీక్షకు 2,125 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. జిల్లా కేంద్రంలో 13 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఐఈవో రవిందర్ కుమార్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే రేఖానాయక్



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని గురుకులాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రేఖానాయక్ హామీ ఇచ్చారు. ఆదివారం ఉట్నూర్ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకు తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయాల బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు చందు, కోల విఠల్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని గురుకులాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే జీతాలను చెల్లించాలని, 12నెలల వేతనాలను ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు ఆరు నెలల జీతాలతో కూడిన ప్రసూతి సెలవులు, అంతేకాకుండా వారి వ్యక్తిగత అవసరాల కోరకు 5రోజుల పాటు అదనంగా సెలవులు ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి సంవత్సరానికి రూ.2వేల ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణిస్తే రూ.10లక్షలు, సహజ మరణం అయితే రూ.5లక్షల పరిహారం అందించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అశోక్, రాజేందర్, సాదిక్ ఉన్నారు.

వర్షాలు కురవాలని కలశం ఎత్తిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-అదిలాబాద్ అర్బన్

వర్షాలు సకాలంలో కురవాలని ప్రార్థిస్తూ ఎమ్మెల్యే జోగు రామన్న నీళ్ల కలశం ఎత్తారు. ఆదివారం తాటిగూడ కాలనీ ఆలయంలో ఏర్పాటు చేసిన గంగ నీళ్ల జాతర కార్యక్రమంలో పాల్గొన్నారు. పంటలు సమృద్ధిగా పండి రైతులకు మంచి దిగుబడులు వచ్చేలా చూడాలని దేవుడిని ప్రార్థించారు. స్థానిక మహిళలతో కలిసి నీళ్లతో నిండిన కలశాన్ని ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం శివలింగానికి నీళ్లను సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎవరున్నా లేకపోయినా హిందూ ధర్మం రానున్న తరాలకు సైతం గుర్తుండి పోయేలా కార్యక్రమాలను నిర్వహిస్తూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలంటే నాటినుండి నేటి వరకు పల్లెల్లో పట్టణాలలో కప్పతల్లి ఆటలు, భీమన్న పూజలు, నీళ్ల జాతర వంటి ప్రత్యేక పూజలను చేస్తూ భక్తిని చాటుతున్నామని గుర్తు చేశారు. గంగపుత్ర సంఘ భవన నిర్మాణానికి రూ.5లక్షలతో స్థలాన్ని కేటాయించామన్నారు. భవన నిర్మాణానికి సైతం మరో రూ.5లక్షలతో నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో పనిచేసే పార్టీలను మాత్రమే గుర్తించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మెన్ మెట్టు ప్రహ్లద్, కౌన్సిలర్ అశోక్ స్వామి, కో ఆప్షన్ సభ్యుడు ఇజ్జగిరి సంజయ్, సాయికుమార్ పాల్గొన్నారు.

కుక్కదాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు



నవతెలంగాణ-ఉట్నూర్

అడుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా వచ్చి కుక్క ముగ్గురు చిన్నారులను గాయపరిచిన ఘటన మండలంలోని హస్నాపూర్‌లో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు, హస్నాపూర్ గ్రామ ఉప సర్పంచ్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సోపియా, ఆహన అనం, సుమయ్య ముగ్గురు చిన్నారులు ఇంటి ముందు అడుకుంటున్నారు. అదే సమయంలో కుక్కవచ్చి ముగ్గురు చిన్నారులను గాయపరిచింది. చిన్నారులను కుక్క కరిచే సమయంలో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో కుక్క పారిపోయింది. వెంటనే చిన్నారులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ కుక్కకాటుకు మందు లేకపోవడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అక్కడ కూడా వ్యాక్సిన్ లేదని ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. ఏజెన్సీ కేంద్రానికి తలమానికంగా ఉన్న ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్కకాటుకు వ్యాక్సిన్ లేకపోవడం బాధాకరమని, ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అందుబాటులో అన్ని మందులు, వ్యాక్సిన్లు ఉంచాలని పలువురు డిమాంచ్ చేశారు.

యాక్టివ్ కన్జ్యూమర్ ఫోరం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యాక్టివ్ కన్జ్యూమర్ ఫోరం ఉమ్మడి జిల్లా నూతన కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలో ఓ హోటల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా తులసి, ప్రధాన కార్యదర్శిగా ఏగంటి రాజు, న్యాయ సలహాదారుడిగా విశ్వనాథ్, మధుసూదన్, మీడియా ఇన్చార్జిగా ఫెరోజ్‌ఖాన్, సురేష్, కార్యవర్గ సభ్యులుగా కిరణ్, అశోక్, వామన్, శిల్ప ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల ప్రతినిధులు మోహన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవ తెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 12 జూన్ 2023

పిడుగుపాటుకు వృద్ధుడి మృతి

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని వెల్గనూరు గ్రామానికి చెందిన కడతల గురువయ్య(65) అనే వృద్ధుడు ఆదివారం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు గురువయ్య ఆదివారం కావడంతో గ్రామ సమీపంలోని పోషమ్మ గుడి వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో పిడుగులు పడ్డాయని ఇదే క్రమంలో సమీపంలోని చెట్టు కింద వెళ్లి ఉండగా పిడుగుపాటుకు గురై మృతి చెందినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని దండేపల్లి ఎస్సై ప్రసాద్ పరిశీలించారు.

పల్లెపల్లెకు ఎమ్మెల్యే రేఖానాయక్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



నియోజకవర్గంలో అప్పుడే ఎన్నికల వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే రేఖానాయక్ ఆదివారం పల్లె పల్లెకు ఎమ్మెల్యే కార్యక్రమం చేపట్టారు. మండలంలోని దనోర-బి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్ఎంపీ వైద్యున్ని పరామర్శించారు. వాడవాడల్లో తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులు వేళాపాళ లేని కరెంటుతో తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పి.శోభ, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

'కుమురంభీం స్ఫూర్తితో జిల్లాను సాధించుకున్నాం'



నవతెలంగాణ - బెజ్జూర్

కుమురంభీం స్ఫూర్తితో ఆసిఫాబాద్ జిల్లాను సాధించుకున్నామని, త్వరలో పోడు భూములకు పట్టాలు అందజేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని బారెగూడెం గ్రామంలో కుమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆమె మాట్లాడుతూ జోడేఘాట్‌లో తెలంగాణ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఈ నెల 24న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జిల్లా పర్యటన నేపథ్యంలో పట్టాలు అందజేస్తామని తెలిపారు. అనంతరం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భీం జెండా, జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో మహిళా కమీషన్ సభ్యురాలు ఈశ్వరిబాయ్, కుమురంభీం మనుమడు ఆత్రం సోనేరావు, జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొముురం మాంతయ్య, ఆదిలాబాద్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గణపతి, ఎంపీపీ రోజా రమణి, జడ్పీటీసీ పుష్పలత, శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, స్థానిక సర్పంచ్ రేణిగుంట్ల సంతోష్, బీఆర్ఎస్ నాయకులు సకారాం, వెంకన్న, పెంటయ్య, జావిద్ అలీ, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో అతిథి ఉపాధ్యాయుల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బోధించడానికి అతిథి ఉపాధ్యాయుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ చిన్నప్పరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సబ్జెక్టులో బోధించడానికి అర్హులైన అభ్యర్థులు 12, 13తేదీల్లో ఆదర్శ పాఠశాలలో అన్ని సర్టిఫికెట్స్, ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరిట్‌తో పాటు డెమో ఆధారంగా సెలెక్ట్ చేస్తామన్నారు.

జాతీయ రహదారి ఎత్తు తగ్గించాలి

నవతెలంగాణ-ముధోల్

బాసర-భైంసా జాతీయ రహదారి రోడ్డు ఎత్తును తగ్గించాలని ఆదివారం స్థానికులు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే ముధోల్‌లో బసవ గార్డెన్ పక్కన నిర్మిస్తున్న జాతీయ రహదారి రోడ్డును పరిశీలించారు. రోడ్డును ఎత్తుగా నిర్మించటం వల్ల రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇండ్లు, పాఠశాల, చేన్లకు వెళ్ళే వారికి ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి, రోడ్డు ఎత్తును తగ్గించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-1 పరీక్ష



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గతంలో నిర్వహించిన పరీక్ష రద్దు కావడంతో ఆదివారం నిర్వహించిన పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఆసిఫాబాద్ డివిజన్‌లో 5 సెంటర్లు, కాగజ్‌నగర్ డివిజన్‌లో 5 సెంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో 10 సెంటర్లలో 2377 మంది హాజరు కావాల్సి ఉండగా 1682 మంది హాజరు కాగా 695 మంది గైర్హాజరైనట్లు ఆర్డీఓ రాజేశ్వర్ తెలిపారు.

కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ జిల్లా కేంద్రంలోని సెంటర్లను డీఎస్పీ శ్రీనివాస్, స్థానిక సీఐ రానా ప్రతాప్‌తో పాటు పరీక్ష నిర్వాహకులతో కలిసి తనిఖీ చేశారు. కేంద్రాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రాజేశం కాగజ్‌నగర్ లోని పలు సెంటర్లు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలని అభ్యర్థులకు సూచించారు.

భీమన్నకు ఎమ్మెల్యే రామన్న పూజలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



పట్టణంలోని డబ్ల్యూ కన్వెన్షన్ హాల్ ఎదురుగా ఏర్పాటు చేసిన భీమన్న పండుగ కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొన్నారు. భీమన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రజల ఆకాంక్ష మేరకు అన్ని మతాలను గౌరవిస్తూ ఆలయాలను నిర్మించామన్నారు. తమ మతంతో పాటు ఇతర మతాలు సైతం గౌరవించబడాలన్నారు. సనాతన ధర్మం నుండి భీమన్న పూజలు చేస్తూ పంట పొలాల్లో విత్తనాలు నాటే వాళ్లమని, ఆ సాంప్రదాయం నేటికీ కొనసాగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిషు, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో పోచమ్మ గుడి పునర్నిర్మాణం

నవతెలంగాణ-కడెం

మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామంలో సర్పంచ్ బానావత్ బేబీ రాజునాయక్ ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి గుడి పునర్నిర్మాణ పనులు అంగరంగ వైభవంగా ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ పోచమ్మ తల్లి దీవెనలు ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పోచమ్మ తల్లిని కోరుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జోరుగా పత్తి విత్తనాల దందా...!

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- మామూళ్ల మత్తులో అధికారులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే రైతులకు కష్టాలు ఆరంభమయ్యాయి. విత్తనాలకు రైతు దళారులను ఆశ్రయిస్తున్నారు. కొందరు నగదు రూపంలో డీలర్ల వద్ద కొనుగోలు చేస్తున్నారు. అయినా రైతులు కోరిన విత్తనాలు దొరకక బ్లాక్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఇదంతా చాపకింద నీరులా జరుగుతోంది. అరికట్టాల్సిన అధికారులు నామ్ కే వాస్తేగా తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వ్యాపారులు తమకు తెలిసిన బడా బాబులకు రాశి 659, కబడ్డీ విత్తనాల కొరత అధికంగా ఉందని ఏజెంట్ల ద్వారా సమాచారం అందిస్తున్నారు. తీరా విత్తనాల కోసం డీలర్ల వద్ద రాగానే రాశి -659, కబడ్డీ రకం విత్తనాలకు రూ.1000కి, రూ.1300కు బ్లాక్‌లో అధిక ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

బిల్లు మీద ఒకటి అమ్మే ధర మరొకటి

వ్యాపారులు తమకు తెలిసిన ఆసాములకు(రైతులకు)పై విత్తనాలు అమ్మేటప్పుడు బిల్లు మీద రూ. 840 రాస్తూ రూ.1000, రూ.1300 అధికంగా ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. బయట ఎవరికీ చెప్పొద్దంటూ బ్లాక్‌లో అమ్మడం గమనార్హం. లేదంటే రాశి-659, కబడ్డీ రకం విత్తనాలు లేవని రైతులకు కరాఖండిగా చెబుతున్నారు. చేసేదేమీ లేక రైతులు అధిక ధరలు చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారు.

రాశి విత్తనాలకు డిమాండ్

గతేడాది రాశి-659 రకం విత్తనాలు అధిక దిగుబడి ఇవ్వడంతో పాటు పత్తి మొదట్లో క్వింటాల్ ధర రూ.8వేలు పలకడంతో ఈ సారి సోయా కంటే పత్తి వంట సాగు వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో రాశి, కబడ్డీ విత్తనాలకు డిమాండ్ పెరిగిందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఏదేమైనా తొలకరి జల్లు పడకముందే పత్తి విత్తనాలకు డిమాండ్ ఇలా ఉంటే ముున్ముందు వ్యాపారులు మరింత కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకునే అవకాశముందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు నిఘా ఉంచి అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని రైతులు పేర్కొంటున్నారు.

అధిక ధరలకు అమ్మితే లైసెన్సు రద్దు చేయాలి

- చవాన్ ఉమాజి నాయక్, హర్కాపూర్



డీలర్లు దర్జాగా పత్తి విత్తనాలను అధిక ధరలకు అమ్ముతున్నారు. అటువంటి డీలర్లపై నిఘా ఉంచాలి. వారిపై కేసులు నమోదు చేసి లైసెన్సు రద్దు చేయాలి. ఉన్నతాధికారులు వ్యాపారుల గోదాములను తనిఖీ చేస్తే వారి భాగోతం బయట పడుతుంది. ఇతర కంపెనీల విత్తనాలు కొంటేనే రాశి విత్తనం అమ్మడం వంటి లింకును తొలగించాలి.

కంటి పరీక్షలు తాత్కాలికమేనా..?

- అప్తమెట్రిస్టుల పరిస్థితి అయోమయం
- ఉద్యోగ భద్రత లేదంటూ ఆవేదన
- శాశ్వత ప్రాతిపదికన నియమించాలని డిమాండ్



అదనపు కలెక్టర్ రాజేశంకు పరీక్షలు నిర్వహిస్తున్న దశ్యం(ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటి చూపుకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. రెండు విడతల్లో 100 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందజేయడంతో పాటు శస్త్ర చికిత్సలు నిర్వహించింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ పరీక్షలు నిర్వహించిన ఆప్తమెట్రిస్టుల పరిస్థితి ప్రస్తుతం అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. రెండు విడతల్లో ప్రభుత్వ పథకంలో భాగస్వాములైన వీరికిఉద్యోగ భద్రత లేకపోవడంతో రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆప్తమెట్రిస్టులపై ప్రత్యేక కథనం

ఎంత కాలం కంటి పరీక్షలు..?

ప్రస్తుతం పెరుగుతున్న సామాజిక మాధ్యమాల ఉపయోగాల వల్ల అనేకమంది కంటి సమస్యలతో బాధపడుతున్నారు. అయితే ప్రభుత్వం నిర్వహించిన కంటి వెలుగు కొద్ది రోజులకు మాత్రమే పరిమితం చేయడంతో అనేక మంది పరీక్షలు చేయించుకోకుండా మిగిలిపోవాల్సిన పరిస్థితి వచ్చింది. వంద రోజుల్లో కోటికి పైగా కంటి పరీక్షలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం నిరంతరాయంగా దీనిని కొనసాగించడానికి ఆసక్తి చూపకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరంతర కంటి పరీక్ష కొనసాగిస్తే మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అయోమయంలో ఆప్తమెట్రిస్టులు

ప్రభుత్వ విభాగంలో ఉద్యోగం అనగానే సాధారణ వ్యక్తికి సంతోషం అవధులు దాటుతుంది. అలాంటి నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగస్వాములైనందుకు ఆప్తమెట్రిస్టులు ఎంతో సంతోషపడ్డారు. ఈ సంతోషం మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది. జిల్లావ్యాప్తంగా 19 మంది ఆప్తమెట్రిస్ట్‌లు కంటి వెలుగు 2 కింద పని చేశారు. వీరి నియామకానికి రెండు ఏజెన్సీలు ఉండడం ఒక ఏజెన్సీ కింద పని చేసే వారికి జీతాలు వేయడం ఇంకొక ఏజెన్సీ వారు వేయకపోవడంతో వీరి పరిస్థితి దయనీయంగా తయారయింది.

ఉద్యోగ భద్రత లేదని ఆవేదన

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు విజయవంతం చేయడానికి ఎంతగానో కృషి చేసినప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమ ఆవేదన వినాలని తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నారు. వీటిలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లేదా సబ్ సెంటర్లలో తమ సేవలను నిరంతరంగా ఉపయోగించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారు. ప్రతినెల వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి

- ప్రవీణ్ యాదవ్, సంఘం జిల్లా అధ్యక్షుడు



పథకాన్ని విజయవంతం చేయడానికి ఎంతగానో కృషి చేశాం. మా సేవలను శాశ్వత ప్రాతిపదికన కొనసాగించాలని కోరుతున్నాం. మా ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ప్రతినెల వేతనాలు మంజూరు చేసే ఉత్తర్వులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నాము. అధికారులు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. సమస్య పరిష్కరించాలని కోరుతున్నాము.

మైనారిటీల అభివృద్ధికి కృషి

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నవతెలంగాణ-ముధోల్



తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ముధోల్‌లో ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న షాదీఖానా నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. అలాగే మండలంలోని తరోడ, గన్నోర గ్రామంలో వ్యవసాయ చేనులకు మొరం రోడ్డు, విట్టోలి తండా గ్రామ పంచాయతీ భవన పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సర్పంచ్ శ్వేత రవికిరణ్ గౌడ్, లావణ్య కిష్టయ్య, విజేష్, ఎంపిటిసి గంగాధర్, నాయకులు అరిపొద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, విఠల్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

అంబేద్కర్ కాస్య విగ్రహ ఏర్పాటుకు కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నూతన కాస్య విగ్రహ ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఇటీవల అంబేద్కర్ అసోసియేషన్ మండల నూతన కమిటీ ఎన్నుకోగా ఆదివారం కమిటీ సభ్యుల సన్మానం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వారిని సన్మానించారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఐబీలో నూతన అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు అన్ని విధాలా సహకారాలు అందిస్తామని, దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించి సమస్యలపై విన్నవించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జగ్జీవన్, ఉపాధ్యక్షుడు కాంబ్లె ప్రజ్ఞశీల్, కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమంలో సాహితీవేత్తల పాత్ర కీలకం



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారుల భాగ్యాస్వామ్యం కీలమైనదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఆదివారం నూతన సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ సాహితి దినోత్సవానికి ముఖ్య అతిథులు హాజరయ్యారు. జిల్లాలోని 134 మంది కవులు తమ కవితలను వినిపించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సరస్వతి దేవి కొలువై ఉన్న మన జిల్లాలో కవులకు, కళాకారులకు కొదవలేదని అన్నారు. కవులు, కళాకారులు సాహితీవేత్తలకు వేదికగా కొత్త కలెక్టరేట్ మారిందన్నారు. నూతన సమికృత కలెక్టరేట్ ప్రారంభించుకున్న తరువాత మొదటిసారిగా సాహితి దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు, సాహితీ వేత్తలు ఎంతో కషి చేశారని పేర్కొన్నారు.అలాంటి వారికి గౌరవించుకోవాలని దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాహితీ దినోత్సవాన్ని నిర్వహించు కుంటున్నామని తెలిపారు. అనంతరం 134 మంది కవులచే కవి సమ్మేళనం నిర్వహించి రూ.వెయ్యి నగదు, మెమోంటో శాలువాల తో సత్కారించారు. చిన్నారుల సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఆర్‌డీఓ స్రవంతి, డీఈఓ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, ప్రముఖ సీనియర్ రచయిత, కవి డాక్టర్ చక్రధరి పాల్గొన్నారు.

కవుల విగ్రహాలకు నివాళులర్పించిన మంత్రి

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ సాహిత్య దినోత్సవం కవి సమ్మేళనం సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని కవయిత్రి మొల్ల, కవి మడిపల్లి భద్రయ్య విగ్రహాలకు పూలు వేసి నివాళు లర్పించారు. వారి సాహిత్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపిపి కోరిపెల్లి రామేశ్వర్‌రెడ్డి, డీఈఓ రవీందర్‌రెడ్డి, కవులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో పొరపాట్లు లేకుండా చూడాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 24వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకొని ఆదివారం ఆసిఫాబాద్ మండల కేంద్రంలో పారిశుధ్యం, పచ్చదనంపై సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణకు హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని, మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పట్టణమంతా పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, రహదారులు, మురుగు కాలువలు, నివాస ప్రాంతాలు అన్ని శుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట రోడ్ల మరమ్మత్తులు, ప్రభుత్వ భవనాలకు రంగులు, రహదారులపై సూచిక బోర్డులు, తదితర ఏర్పాట్లతో పాటు అవసరమైన చోట సిసి రోడ్ల నిర్మాణాలు చేపట్టి త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఈఈ రామ్మోహనరావు, ఇన్‌ఛార్జి డీపీఓ సురేందర్ పాల్గొన్నారు

చెస్ పోటీల విజేతలకు బహుమతులు అందజేత

అనంతరం జిల్లాలోని రెబ్బెన మండలం గోలేటిలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో మొదటిసారిగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సీనియర్ చెస్ ఛాంపియన్షిప్-2023 పోటీల ముగింపు వేడుకలకు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని, దీని ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో బాసర వాసికి సత్కారం

నవతెలంగాణ-బాసర

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో మండల పరిధిలోని ఓని గ్రామానికి చెందిన అబ్బువార్ గౌతమ్‌ను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరించారు. కవి సమ్మేళనంలో భాగంగా 'బుక్కెడే బువ్వ కోసం' అనే శీర్షికపై కవితా సంకలనాన్ని వినిపించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు అబ్బువార్ గౌతంను అభినందించారు.

తెలంగాణ ద్రోహులకు ప్రాధాన్యత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో అసలైన ఉద్యమకారులను కాకుండా తెలంగాణ ద్రోహులకు ప్రాధాన్యత ఇచ్చేలా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆమె నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారన్నారు. అర చేతిలో స్వర్గం చూపిస్తూ మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నాయకుల దోపిడీని ప్రజలు గమనిస్తున్నారని, కేవలం ఎన్నికల సమయంలో కొత్త హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు గందే విజయ్‌కుమార్, జీవి రమణ, గన్నోజి విజయ్, కాంత, నరేష్ తోకల, సబ్దార్, అశాంత్, ముఖేం, ఆరిఫ్, రాము, శివ ఉన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 12 జూన్ 2023

గుండెపోటుతో సహకార సంఘం చైర్మన్ మృతి

నవతెలంగాణ-వేమనపల్లి

మండల వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ గూడ కిషన్ రావు (83) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని లింగాల గ్రామానికి చెందిన ఆయన సుదీర్ఘకాలంగా రాజకీయంగా అనేక పదవులలో కొనసాగారు. గతంలో వేమనపల్లి ఎంపీపీగా మూడు సంవత్సరాల పాటు లింగాల సర్పంచ్‌గా 5 సార్లు, వేమనపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా 18 సంవత్సరాల పాటు మొత్తం 46 సంవత్సరాలు పాటు రాజకీయంగా ప్రజలకు సేవ చేశారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ రాజకీయాల్లో తనకంటూ ముద్ర వేసుకొని అనేక పదవుల్లో కనసాగారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2019లో టీఆర్ఎస్‌లో చేరి పీఏసీఎస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు భార్య మనోహర భాయి ముగ్గురు కూతుర్లు కొడుకు శ్రీనివాస్ ఉన్నారు.

బుద్ధుని బోధనలు పాటించాలి

సిర్పూర్(టి) : గౌతమ బుద్ధుడు బోధించిన అష్టాంగా మార్గాలను అనుసరించి ఆయన సూచించిన బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నాగమ్మ చెరువులో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన సొంత నిధులతో నిర్మించిన బుద్ధ విగ్రహాన్ని ఆమె సందర్శించి బుద్ధ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి గొప్ప రాజ్య వంశస్తుడని, సిరిసంపదలతో తన జీవితాన్ని గడపాల్సిన వ్యక్తి సమాజంలో జరుగుతున్న అసమానతల గురించి ఆలోచించి బౌద్ధి వృక్షం వద్ద తపస్సు చేశారు. ఆయన బోధనలు ఆదర్శంగా తీసుకొని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాటించారని అన్నారు. నేటి యువకులు ఆయన బోదనలు పాటిస్తూ సమాజంలో శాంతిని నెలకొల్పవచ్చున్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్, లోనవెల్లి ఎంపీటీసీ తుకారాం, వార్డుసభ్యులు ఇఫ్తత్ హుస్సేన్, బీఆర్‌ఎస్ నాయకులు చునార్కర్ హోమాజీ, అబ్దుల్ అఖిల్, జునేద్ హైమద్, నానాజీ పాల్గొన్నారు.

జోరుగా కలప అక్రమ రవాణా..!

- గతంలో సైకిల్, ఇప్పుడు కార్లలో
- అధికారుల కండ్లుగప్పి యథేచ్ఛగా దందా





నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లో కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.అక్రమార్కులు అధికారుల కండ్లు కప్పి గుట్టుచప్పుడు కాకుండా కలపను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో సైకిల్ ద్వారా కలపను తరలింగా ఇప్పుడు లేటెస్ట్ గా కార్లలోనే కల్పన తరలిస్తూ అక్రమ రవణా సాగిస్తున్నారు. కొందరు అక్రమ కలప రవాణా దారులు అయితే కార్లకు పోలీస్, ప్రెస్, గౌట్ వెహికల్, అని స్టిక్కర్లు అంటించుకొని చెక్ పోస్ట్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని బోల్తా కొట్టిస్తూ, జోరుగా కలప రవాణా సాగిస్తున్నారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో, గత కొంతకాలంగా స్తబ్దతగా ఉన్న కలప అక్రమ రవాణా ఇప్పుడు జోరందుకోంటోందని పలు విమర్శలు వినిపిస్తున్నారు.

కొత్త తరహాలో అక్రమ రవాణా

జన్నారం అటవీ డివిజన్ అధికారులు గడ్డి క్షేత్రాల మీద దృష్టి సారించి, దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపితే, స్మగ్లర్లు మాత్రం గత కొంతకాలంగా కొత్త కొత్త పద్ధతులతో కలపను అక్రమ రవాణా చేస్తున్నారు. కారులలో మూడు నాలుగు ఫీట్ల దుంగలు వేసుకొని, గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళు న్నారు. అడవిలో చెట్టు కొట్టిన వ్యక్తుల వద్ద, మధ్య వర్తి ఒకరు ఫీట్‌కు రూ.1000 నుంచి రూ.1200 కొనుగోలు చేసి, కారులో తరలించే వ్యక్తికి ఫీటుకు రూ.2000 వరకు అమ్ముతాడు. అతను మంచిర్యాల, కరీంనగర్, జగిత్యాల, హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు తరలించి అదే టేకు ముక్కలను ఫీట్‌కు రూ.8000 వేల నుంచి రూ.10000 వరకు విక్రయిస్తారు. ఇంతగా కలప అక్రమ రవాణా సాగుతున్నప్పటికీ వీరిని కట్టడి చేయలేక అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వివరిస్తున్నారు. పక్కా సమాచారం ఉంటే తప్ప కారులో తరలిస్తున్న కల్పను పట్టుకోవడం సాధ్యం కాదంటున్నారు.

ఎక్కువగా కవ్వాల్‌టైగర్ జోన్ నుంచే





కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని జన్నారం మండలంలోని కవ్వాల్, లోతోరే, కొత్తూరు పల్లె, దేవుని గూడా, కామన్‌పల్లి, అల్లినగర్, దొంగపల్లి, మల్యాల, నుంచి రోజుకు రూ.లక్షల విలువ చేసే కలప, తరలిపోతోంది. చింతాగుడా రోటి గుడా, తపాలాపూర్, గ్రామాల మీదుగా గోదావరి నది దాటించి సొమ్ము చేసుకుంటున్నారు.అలాగే నిర్మల్ జిల్లాలోని కడెం మండలం ఇస్లాంపూర్, ఎర్రకుంట, బుట్టాపూర్, రేవోజిపేట, కల్లెడ గ్రామాల నుంచి అడ్డు అదుపు లేకుండా కలపను కారులో తరలిస్తున్నారు. కల్లెడలోని విలువైన టేకు కలప ఉండడంతో అక్కడ నుంచి కార్లలో కలమడుగు, కమ్మనూరు, వంతెన మీదుగా జగిత్యాల జిల్లాకు, తపాలాపూర్ చెక్ పోస్ట్ మీదుగా మంచిర్యాలకు తరలిస్తున్నారు. దండేపల్లి మండలంలోని దమ్మన్నపేట, తాళ్ల పేట, మాకులపేట, తానిమడుగు, గ్రామాల నుంచి కల్పన కార్లలో తరలిస్తున్నారు.

అరికట్టేందుకు తనిఖీలు తప్పనిసరి

కలప అక్రమ రవాణా ఆగాలంటే గట్టి తనిఖీలు తప్పనిసరి, చెక్‌పోస్టుల వద్ద వాహనానికి ఎలాంటి స్టిక్కర్ ఉన్న క్షుణ్ణంగా పరిశీలించాలి. డిక్కీలోని తెరిచి చూడాలి. ప్రస్తుతం ఉన్న చెక్ పోస్టల వద్ద సీసీ కెమెరాలను అమర్చిన ఫలితం లేకుండా పోతుంది. గట్టి నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు రాత్రివేళ మాత్రమే స్మగ్లింగ్ చేసేవారు. ఇప్పుడు అన్నివేళలా కలప తరలిపోతోంది. ఇటీవల జన్నారం మండలంలోని కొన్ని గ్రామాల్లో సోదాలు నిర్వహించగా అక్రమంగా నిలువ ఉంచిన, రూ.50 వేల విలువైన కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. ఇలా ఎన్నో గ్రామాల్లో కలప అక్రమంగా నిలువ చేసి ఉంచుతున్నారు. సమయాన్నిబట్టి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.



పట్టుబడ్డ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

సిరిపురం మాధవరావు, డిప్యూటీ కన్జర్వేటర్

ఇటీవల అక్రమంగా కలపను, తరలిస్తున్న రెండు కార్లను పట్టుకున్నాం. ఆ కార్లను డివిజన్ కార్యాలయానికి తరలించాం. అలాగే కవ్వాల్ కొత్తపేట తదితర గ్రామాల్లో తనిఖీలు నిర్వహించగా ఇండ్లలో అక్రమంగా నిలువ ఉంచిన రూ.50వేల విలువ గల కలపను పట్టుకొని రేంజ్ తరలించాం. కలప స్మగ్లింగ్‌కు పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తాం క్రిమినల్ కేసు నమోదు చేస్తాం. ఎవరైనా అటవీ అధికారులకు స్మగ్లర్లతో చేతులు కలిపి కలప అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

కాగజ్‌నగర్‌లో నిలిచిన రైళ్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం పలు రైళ్లు గంటల తరబడి నిలిచిపోయాయి. బెల్లంపల్లి-మందమర్రి రైల్వేస్టేషన్ల మధ్యలో రైల్వే లైనుకు సంబంధించిన విద్యుత్తు వైరు ప్రమాదవశాత్తు తెగింది. దీంతో ఆయా రైళ్లను ఎక్కడి రైల్వేస్టేషన్లలో అక్కడే గంటల తరబడి నిలిపేశారు. బల్లార్ష-సికింద్రాబాద్ మధ్య పలు రైళ్లు రెండు నుంచి మూడు గంటల పాటు ఆలస్యంగా నడవగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సికింద్రాబాద్-కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ నుంచి మధ్యాహ్నం 2.55 గంటలకు బయలు దేరాల్సి ఉండగా, మూడు గంటల పాటు ఆలస్యంగా సాయంత్రం ఆరుగంటలకు కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు బయలు దేరింది. సికింద్రాబాద్-దానపూర్ ఎక్స్‌ప్రెస్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు మధ్యాహ్నం 2.30 గంటలకు రాగా, మూడు గంటల పాటు స్టేషన్లోనే నిలుపుదల చేసి, సాయంత్రం 5:30 గంటలకు సికింద్రాబాద్ వైపు బయలు దేరింది. చెన్నై-కాట్రా(అండమాన్), జీటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు సైతం మూడు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. పలు గూడ్స్ రైళ్లను గంటల తరబడి ఆయా స్టేషన్లలో నిలిపేశారు. ఈ విషయమై స్థానిక రైల్వే అధికారులను సంప్రదించగా బెల్లంపల్లి మందమర్రి మధ్య సాంకేతిక సమస్య కారణంగానే ఆలస్యంగా రైళ్లు నడిచినట్లు సమాధానమిచ్చారు.

ఈదురు గాలుల బీభత్సం

నవతెలంగాణ-మందమర్రి

పట్టణ కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గాలులకు పట్టణంలోని విద్యుత్ స్తంభాలు, చెట్లు, రేకుల షెడ్లు, బోర్డులు నేలకొరిగాయి. ఏమి జరుగుతుందోనని పట్టణ వాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఒకటవ జోన్ లోని పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో రావి చెట్టు విద్యుత్ తీగలపై పడటంతో ఏకంగా 3 విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగగా, మరో 3చోట్ల కూడా స్తంభాల విరిగిపోయాయి. మార్కెట్ ఏరియాలోని మహా లక్ష్మీ ట్రేడర్స్, శ్రీనివాస ఎలక్ట్రికల్స్‌లో ఆస్తి నష్టం జరిగింది. షాప్స్ పైన ఉన్న రేకులు బలమైన గాలులకు ఎగిరిపోవడంతో వర్షం నీరు పడటంతో సుమారు 500 సిమెంట్ బస్తాలు తడిసిపోయాయి. విషయం తెలియగానే మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు పరిస్థితిని సమీక్షించగా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మాత్రం పునరుద్ధరణ పనులు కొరకు 2గంటలు గడిచిన కూడా కనిపించకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈదురు గాలులకు తెగిన విద్యుత్ తీగలు

కెరమెరి : ఆదివారం మధ్యాహ్నం కురిసిన ఈదురు గాలుల వర్షానికి శివ గూడ గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. తెగిన విద్యుత్ తీగలు రోడ్డుపై పడడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శివ గూడ పాట్నాపూర్, పెద్ద పాట్నాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు వెంటనే స్పందించి తెగిపడిన విద్యుత్ తీగలను సరి చేయాలని కోరుతున్నారు.

14న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఈ నెల 14న ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ ఛాంబర్ ఇంటర్ నేషనల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని మంచిర్యాల జేసీఐ అధ్యక్షుడు అరుముళ్ల రాజు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిబిరంలో విద్యార్థులు, విద్యావంతులు రాజకీయ నేతలు, స్వచ్ఛంద సంస్థలు, మంచిర్యాల జిల్లా వాసులు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని ముల్కలపేట గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ తుమ్మిడే లచ్చయ్యకు చెందిన రెండు ఇండ్లు గురువారం రాత్రి నిప్పంటుకొని దగ్ధం కాగా విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదివారం వారి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి నూతన వస్త్రాలు రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వం నుంచి వచ్చే డబుల్ బెడ్ రూమ్ వచ్చేలా చూస్తానని, తమ వంతు సాయంగా నష్టపరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కోలి వేణుమాధవ్ రావు, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాగౌడ్, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, ఎంపీటీసీ దాగామ బాపు, సర్పంచులు రాజాలింగు, బాపు, మధుకర్, మాజీ సర్పంచులు రుద్రభట్ల లక్ష్మినారాయణ, బోర్కుటి సంతోష్, కుబిడే వెంకటేష్ పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడి ఎన్నిక

నవతెలంగాణ-మందమర్రి

బీసీ యువజన సంఘం మందమర్రి పట్టణ అధ్యక్షునిగా ముడారపు రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఆదివారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్, రాష్ట్ర నాయకులు ఉదారి చంద్రమోహన్, మందమర్రి పట్టణ అధ్యక్షుడు కొండిల్ల శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవిని కట్టబెట్టిన జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నీలకంటేశ్వర్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్, రాష్ట్ర నాయకులు ఊదరి చంద్రమోహన్, పట్టణ అధ్యక్షుడు కొండిల్ల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం అభ్యున్నతికి కృషి చేస్తానని, బీసి కులాల హక్కుల కోసం యువతను చైతన్య పరుస్తూ ముందుకు వెళ్తానని తెలిపారు.

ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు ఉచిత వైద్య శిబిరాలు

నవతెలంగాణ-జన్నారం

ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని మురిమడుగులో లిటిల్ హన్స్ పాఠశాల ఆధ్వర్యంలో శ్వేత హాస్పిటల్స్, జగిత్యాల వారి సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామ ప్రజలకు పలు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు గోలీలను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్ రావు, గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి రాజకుంగు, ఎంపీటీసీ జాడి భూమక్క జగన్, అమరకొండ రాజేష్, గద్దల పవన్ పాల్గొన్నారు.

బీసీబంధు అమలు చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్రంలోని బీసీ బంధు అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గోలెం వెంకటేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 52 శాతం బీసీలు ఉన్నారని, జనాభాలో సగం కంటే ఎక్కువ ఉన్న వీరికి బీసీ బంధు అమలు చేయాలన్నారు. బీసీ కులవృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం కేవలం ఎన్నికల కోసమేనని అన్నారు. మరోసారి బీసీలను మభ్యపెట్టే ప్రయత్నమే తప్ప చితుశుద్ధి లేదని అన్నారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీచేయాలి

- బదిలీలు, ఉద్యోగోన్నతలు చేపట్టాలి
- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి



నవతెలంగాణ-హాజీపూర్

పాఠశాలల్లో బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) మంచిర్యాల జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతకుమారి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొల్ల రామన్న, గుర్రాల రాజావేణులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా పాఠశాలలు బాగా నడవాలంటే పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. దానికి పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని వేగిరం చేసి అన్ని పాఠశాలలకు విస్తరించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని, హైస్కూల్స్‌లో సబ్జెక్ట్ టీచర్‌ల కొరతను తగ్గించడానికి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి, బదిలీలు చేపట్టాలని అన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని కోరారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూల్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, కేజీబీవీ, యుఆర్ఎస్ లలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు బేసిక్ పే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా జూన్ 20న నిర్వహిస్తున్న విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలల బాగు కోసం డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని, పర్యవేక్షక అధికారులైన డీఈఓ, ఎంఈఓ, డిప్యూటీ ఈఓ పోస్టులను వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చక్రపాణి, లావణ్య, జిల్లా కార్యదర్శులు నర్సయ్య, చంద్రమౌళి, సంతోష్ కుమార్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ సాహితీ దినోత్సవం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ సాహితీ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం స్థానిక బస్టాండ్ సమీపంలోని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ సామల సదాశివ మాస్టార్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కాడే, అదనపు కలెక్టర్ రాజేశం, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్‌తో పాటు పలు సంఘాల నాయకులు సదాశివ మాస్టారు విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సామల సదాశివ ఉర్దూ, తెలుగు సాహిత్యాలలో మంచి పేరు సాధించి జాతీయ స్థాయిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పేరును నిలబెట్టారని అన్నారు. తెలంగాణ సాహితీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ కవులను ప్రభుత్వమే సన్మానించడం మంచి సాంప్రదాయమని అన్నారు. అనంతరం ఇటీవల తెలంగాణ సారస్వత పరిషత్ అవార్డు అందుకున్న పెండ్యాల కిషన్‌శర్మ, కాకతీయ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ తీసుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మినరసింహంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్తలు, పద్మశాలి సంఘం, సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

13 తర్వాత బదిలీలు, ఉద్యోగోన్నతులు



నవతెలంగాణ-జన్నారం

పీఆర్టీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వంతో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతలపై చర్చిస్తున్నట్టు జూన్ 13 తర్వాత ప్రక్రియ ప్రారంభించేలా కృషి చేస్తున్నామని ఆ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, పీఆర్టీయూ మాసపత్రిక రాష్ట్ర ప్రధాన సంపాదకులు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. పత్రికా ప్రధాన సంపాదకులుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారి జన్నారం వచ్చిన సందర్భంగా ఆయన ఆదివారం పీఆర్టీయూ భవన్‌లో మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కట్ట రాజమౌళి, నగూరు సత్యనారాయణల ఆధ్వర్యంలో శాల్వా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్నారెడ్డి మాట్లాడుతూ జులై 2023 నుంచి పీఆర్సీ కమిటీ ఏర్పాటు కంటే ముందే ఐఆర్ ఇప్పిస్తామన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయించనున్నామని అన్నారు. సీపీఎస్ ఉపాధ్యాయులందరికి పాత పెన్షన్ వర్తించే విధంగా కషి చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులు మంజూరు చేయిస్తామన్నారు. ప్రభుత్వంపై సమస్యలతో పాటు పెండింగ్ సమస్యలు పరిష్కరించక పోతే నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర కార్యనిర్వాహక వర్గం తీర్మాణించిందని అందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయ్ కుమార్, పీఆర్టీయూ స్టేట్ అసోసియేటెడ్ ప్రెసిడెంట్ జాడి మురళి, జాజాల శ్రీనివాస్, డాక్టర్ శివ దాస్ దేవాజి, ప్రవీణ్, ఎల్లా నరసయ్య పాల్గొన్నారు.

చెస్ పోటీ విజేతలకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో రాష్ట్రస్థాయి ఓపెన్-2 ఆల్ చెస్ పోటీలు గత మూడు రోజులుగా కొనసాగాయి. ఈ పోటీల్లో 33 జిల్లాల నుండి చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం చివరి రోజు రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన ఎండీ బాసిక్, ఇమ్రోస్, జిల్లా నలగొండ ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి సీహెచ్ సాయి, కురుపనేని, హైదరాబాద్, తృతీయ బహుమతి ఎన్ రోహిత్, మేడ్చెల్, నాల్గవ బహుమతి సూర్య ఎలకంటి, రంగారెడ్డి విజేతలుగా నిలవగా జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి చేతులమీదుగా బహుమతులను అందజేశారు. గెలుపొందిన క్రీడాకారులు ఆగస్టు 15వ తేదీ నుండి 27వ తేదీలో మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. అనంతరం రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొనే వారందరికి ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొన్న వారందరికి ధన్యవాదాలు తెలిపారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో నేషనల్ చెస్ చాంపియన్స్‌లో పాల్గొనే చెస్ క్రీడాకారులు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తూ వారికి సహయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కనకయ్య కుందారం శంకరమ్మ జిల్లా అధ్యక్షుడు కోట సుధాకర్, మల్రాజ్ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు బి.గోపాలకృష్ణ, ఉపేందర్, జ్యోతిరెడ్డి రవీందర్, మల్లేష్(కోశాధికారి), జాయింట్‌సెక్రటరీ ఆంజనేయులుగౌడ్, కుందారపు నరేష్, కల్పన, చీఫ్ కోఆర్డినేటర్ చంద్రమౌళి, రామయ్య, గోలేటి సర్పంచ్ పోటు సుమలత శ్రీధర్‌రెడ్డి, గోపిరెడ్డి పాల్గొన్నారు.

నిషేధిత గడ్డిమందు పట్టివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గడ్డి మందును టాస్క్ ఫోర్స్ అధికారులు ఆదివారం తెల్లవారుజామున ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ సిఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నుండి ఆసిఫాబాద్‌కు అక్రమంగా గడ్డి మందు తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి నిందితుల్ని పట్టుకున్నారు. వాంకిడి మండలం ఇంద్రనగర్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ 10 బాటిల్ల గడ్డి మందులు జిల్లా కేంద్రానికి తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నారు. పట్టుకున్న గడ్డి మందు విలువ రూ.14800 ఉంటుందని తెలిపారు. గ్లైఫోసెట్‌ను హెచ్‌టీ(హెర్బిసైడ్ టాలరెంట్) పత్తి విత్తనాలు సాగు చేస్తే అట్టి చేలల్లో కలుపు నివారణకు ఉపయోగిస్తారని తెలిపారు. ప్రభుత్వాలు హెచ్‌టీ పత్తి విత్తనాలతో పాటు గ్లైఫోసెట్‌ను నిషేధించాయన్నారు. అయినప్పటికీ కొందరు వ్యాపారులు అక్రమంగా హెచ్‌టీ పత్తి విత్తనాలతో పాటు గ్లైఫోసెట్ మందులను అమ్ముతున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలు, నిషేధిత మందులు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఎస్సై సందీప్, కానిస్టేబుల్ మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

గొర్రెల కాపరుల సంఘం డైరెక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-జన్నారం

గొర్రెల కాపరుల సంఘం మంచిర్యాల జిల్లా డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన గట్టు మహేష్‌ను గ్రామస్తులు, శాల్వా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్ మాట్లాడుతూ గొర్రెల కాపరుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. పీఏసీఎస్ డైరెక్టర్ సాదు పాషా, కోల పద్మారావు, వాసాల నరేష్, మోసిన్‌ఖాన్, రాము, సత్యం మహేష్, మల్లేష్, సాయి అశోక్, సత్యన్న, శ్రవణ్, మహిపాల్ పాల్గొన్నారు.

సోమగూడెం లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెంలో లయన్స్ క్లబ్ నూతన కమిటీని ముఖ్య అతిథి ఇన్స్టాలేషన్ ఆఫీసర్ లయన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు నూతన కమిటీని ఆదివారం ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించినారు. నూతన కమిటీ అధ్యక్షులుగా దూడం మహేష్, సెక్రటరీ కడలి శ్రీకాంత్, కోశాధికారి పాముల దినేష్, ఎల్ సీఐఎఫ్ మేడ సమ్మయ్య, వైస్ ప్రెసిడెంట్స్ వేముల కృష్ణ, నస్పూరి నరసింగం, క్లబ్ మెంబర్ షిప్ చైర్మన్ పుస్కూరి వంశీకృష్ణ రావు, క్లబ్ సర్వీస్ డి.సరోజ, క్లబ్ మార్కెటింగ్ కే.దుర్గా, ఎస్ జ్యోతి, ఫ్యామిలీ, ఉమెన్ చైర్మన్ వీ.వకులాదేవిలను ఎన్నుకొన్నారు.